# అణు కార్యక్రమం

**"నాకు జీవితమంటే ఒక్క క్షణం వెలిగి ఆరిపోయే కొవ్వొత్తి కాదు. అది నా చేతికందిన కాంతులు వెదజల్లే టార్చి వంటిది. రాబోయే తరాలకు అందించే నాటికి దాన్ని త్యధిక కాంతులతో వెలిగించాలని నా కోరిక"- ఇది జార్జి బెర్నాడ్‌షా మాట! ఈ బాటలో నడిచే వ్యక్తులు మనకు చాలా అరుదుగా దర్శనమిస్తారు.. అలాంటి అరుదైన మహామనీషి హోమి జహంగీర్ బాబా..! భారత అణు కార్యక్రమ పిత!!**

భారత అణు కార్యక్రమానికి పునాది వేసిన... హోమి జె బాబా 1909, అక్టోబరు 30న జన్మించారు. పార్సీ కుటుంబం. తండ్రి బ్రిటన్‌లో లా చదువుకున్నారు. తల్లి, తండ్రి తరపు బంధువులంతా ప్రముఖ వ్యాపార కుటుంబాలకు చెందినవారు.

ఆ కారణంగా బాబాకు దిన్షా మానెక్‌జి పెటిట్, మహ్మద్ అలీ జిన్నా, హోమి కె బాబా, దోరబ్ టాటా వంటి ప్రముఖులతో పరిచయం ఏర్పడింది. బాంబేలో ప్రాథమిక విద్య, రాయల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో చదవు పూర్తయ్యాక... ఉన్నత విద్యాభ్యాసంకోసం ఆయన కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో చేరారు. ఇంజినీరింగ్ పూర్తయ్యాక బాబా... జంషెడ్‌పూర్‌లోని

టాటా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీలో పనిచేస్తే బాగుంటుందని ఆయన తండ్రి భావించారు. బాబా నిర్ణయం మాత్రం భిన్నంగా ఉంది. 1928 లో తండ్రికి ఒక లేఖ రాస్తూ... ''నిజం చెప్పాలంటే.. ఉద్యోగం, వ్యాపారం నాకు ఎంతమాత్రం సరిపడవు.నా ఆలోచనా ధోరణికి అది పూర్తిగా భిన్నం. ఫిజిక్స్ నా జీవితం. ఆ సబ్జెక్ట్‌లో నేను గొప్ప విజయాలు సాధించగలను. నేనే కాదు.. తనకు అమితంగా ఇష్టమైన రంగంలో ఏ వ్యక్తి అయినా గొప్ప విజయాలు సాధించగలడు. నేను అంతే! నా విజయం.. ఇతరులు నా గురించి ఏమనుకుంటున్నారు? అనేదానిపై ఆధారపడి ఉండదు. నా విజయం నా పని పైనే ఆధారపడి ఉంటుంది'' అని వివరించారు. కుమారుడి ఆలోచనలు అర్థం చేసుకున్న తండ్రి... చదువుకొనసాగించేందుకు సమ్మతించారు.

కేంబ్రిడ్జిలో మెకానికల్ ఇంజినీరింగ్ పట్టాపుచ్చుకున్నాక... కవెండిష్ లేబొరేటరీలో కొంతకాలం పని చేశారు. నాడు ఆ లేబరేటరీ అనేక గొప్ప పరిశోధనలకు వేదికైంది. అక్కడే జేమ్స్ చాడ్విక్ న్యూట్రాన్‌ను కొనుగొన్నారు.. జాన్ కాక్రఫ్ట్, ఎర్నెస్ట్ వాల్టన్ లిథియంను ప్రోటాన్లతో పరివర్తనం చెందించారు. ప్రసిద్ధ శాస్త్రవేత్త, అదే సమయంలో ఆ లేబరేటరీలోనే బాబా కాస్మిక్ కిరణాలపై పరిశోధనలు ప్రారంభించారు. నోబెల్ బహుమతి గ్రహీత పాల్ దిరాక్ ప్రభావం బాబాపై గణనీయంగా ఉంది. బాబా పలు పరిశోధన పత్రాలు ప్రచురించారు. 'ద అబ్సార్ప్సన్ ఆఫ్ కాస్మిక్ రేడియేషన్' అయన తొలి పరిశోధన పత్రం. ఈ పరిశోధన పత్రం కారణంగా 1934లో బాబాకు ఐసాక్ న్యూటాన్ స్టూడెంట్‌షిప్ లభించింది. బాబా భారత్‌లో విహార యాత్రలో ఉన్న సమయంలో .. 1939 సెప్టెంబరులో రెండో ప్రపంచ యుద్ధం మొదలైంది. దాంతో యుద్ధం ముగిసేవరకూ భారత్‌లోనే ఉండాలని ఆయన నిర్ణయించుకున్నారు. ఆ సమయంలోనే బెంగుళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో రీడర్‌గా చేరారు..నోబెల్ బహుమతి గ్రహీత సి.వి.రామన్‌తో కలిసి 1939లో బెంగుళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో కాస్మిక్ కిరణాల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త జె.ఆర్.డి.టాటా సహకారంతో టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ పండమెంటల్ రీసెర్చ్‌ను స్థాపించారు. భారత్ స్వాతంత్ర్యం పొందాక 1948లో అణు ఇంధన కమిషన్‌ను ఏర్పాటు చేశారు.

1950లలో అంతర్జాతీయ అణు ఇంధన సదస్సుల్లో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించారు. 'శాంతియుత అవసరాలకు అణు ఇంధనం' అంశంపై 1955లో స్విట్జర్లాండ్‌లో జరిగిన ఐక్యరాజ్య సమితి సదస్సుకు అధ్యక్షుడిగా పనిచేశారు. అనంతరం ఆయన భారత్‌లో కేబినెట్ సైంటిఫిక్ అడ్వైజరీ కమిటీలో సభ్యుడిగా పనిచేశారు. అంతరిక్ష పరిశోధనలపై విక్రమ్ సారాభాయ్ నేతృత్వంలో ఇండియన్ నేషనల్ కమిటీ ఏర్పాటు చేశారు. 1966లో ఆస్ట్రియాలోని వియన్నాకు వెళ్తూ మాంట్ బ్లాంక్ వద్ద జరిగిన విమాన ప్రమాదంలో బాబా మరణించారు. ఆ విమాన ప్రమాదంపై పలు సందేహాలు వ్యక్తమయ్యాయి. భారత అణు కార్యక్రమాన్ని దెబ్బతీసేందుకు ఆయన్ను ప్రమాదానికి గురిచేసి, చంపారనే అనుమానాలు వచ్చాయి. బాబా పట్ల గౌరవ సూచకంగా అణు ఇంధన సంస్థను బాబా అణు ఇంధన సంస్థగా పేరు మార్చారు. అణు ఇంధన రంగంతోపాటు ఎలక్ట్రానిక్స్, అంతరిక్షం, రేడియో ఆస్ట్రానమీ, మైక్రోబయాలజీలో పరిశోధనలకు కూడా బాబా ప్రోత్సహించారు. ఊటీలోని ప్రసిద్ధ రేడియో టెలిస్కోప్ బాబా ఆలోచన, కృషి ఫలితమే!!